

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0



బిల్లులు సకాలంలో ఇవ్వాలి



ప్రతీరోజు 40 లీటర్ల పాలు కేంద్రానికి పోస్తున్నాను. గడిచిన నాలుగేళ్లుగా ప్రోత్సాహక సొమ్ము రావడం లేదు. దాదాపు రెండు లక్షలకు పైగా రావాల్సి ఉంది. ప్రభుత్వం తక్షణం స్పందించి డబ్బు చెల్లిస్తే పాడి రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.

- పాలమోని రవీందర్, రైతు, కొట్ర, వెల్దండ మండలం

పాల బిల్లు సకాలంలో అందించాలి



15 రోజులకొకసారి పాల బిల్లు ఇవ్వకపోవడంతో మాకు ఆర్థికంగా అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతీరోజు 140 లీటర్ల పాలు సేకరణ కేంద్రానికి పోస్తున్నాను. ఆరు నుంచి ఏడు లక్షల ప్రోత్సాహకం రావాల్సి ఉంది. 15 రోజులకు ఇవ్వాల్సిన బిల్లు ఐదు నెలలుగా పెం డింగ్‌లో ఉండటంతో పాడి నిర్వహణ కష్టతరంగా తయారైంది.

- తోడేటి చంద్రశేఖర్‌రెడ్డి, తిమ్మనోనిపల్లి, వెల్దండ మండలం



పాడికి పాడె

» నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రోత్సాహకం » నాగర్‌కర్నూల్ జిల్లాలోనే రూ. 35 కోట్ల బకాయి » అందని పాల బిల్లులు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన జిల్లాల్లో పాల ఉత్పత్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందక రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రోత్సాహకం సొమ్ము సంగతి దేవుడెరుగు. కనీసం నెలనెలా రావాల్సిన పాల బిల్లులు కూడా అందక పాడి రైతులు విలవిల్లాడుతున్నారు. డెయిరీ ఫారాల నిర్వహణకు పెరిగిన ఖర్చులు, దాణా కొనుగోలు వ్యయం కూడా పెరగడంతో నిర్వహణ కష్టంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పాల ఉత్పత్తిలో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలోనే రెండవ స్థానంలో ఉన్నది. 2014కు పూర్వం ఇక్కడ తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం సాగునీటి ప్రాజెక్టులు కూడా లేకపోవడంతో రైతులను పాడి పరిశ్రమ వైపు మళ్లించడానికి అప్పటి ప్రభుత్వం పాడి పరిశ్రమను బాగా ప్రోత్సహించింది. ఈ క్రమంలో లీటరు పాలకు రూ. 4 ప్రోత్సాహకం ఇవ్వడం ద్వారా రైతులను ఆకర్షించి పాల ఉత్పత్తిని పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. 2014లో లీటరుకు రూ. 4 ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం ప్రకటించగా 2020 వరకు ఇన్సెంటివ్‌ను అందించారు. గడిచిన నాలుగేళ్లుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలోనే దాదాపు రూ. 35కోట్ల ప్రోత్సాహకం బిల్లులు రైతులకు ఇవ్వాల్సి ఉంది.

పాల బిల్లులు అందక పాడి రైతుకు కనాకష్టంగా మారింది. పాల ఉత్పత్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకం ప్రకటించినా వారి దరి చేరడం లేదు. ఫలితంగా డెయిరీ ఫారాల నిర్వహణ భారంగా మారింది. పెరిగిన ఖర్చులు, దాణా కొనుగోలు వ్యయంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు.



పాలు ఇచ్చే గేదెలు

జిల్లాలో 210 పాల సేకరణ కేంద్రాలు

జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్‌లలో 210 పాల సేకరణ కేంద్రాలున్నాయి. ప్రతీరోజు 905 మంది రైతులు 95 వేల లీటర్ల పాలు పాలసేకరణ కేంద్రాలకు అందిస్తున్నారు. విజయ డెయిరీ ద్వారా వివిధ పాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. లీటరు ఆవు పాలకు వెన్నశాతం ఆధారంగా కనిష్ఠంగా రూ. 40.25, గరిష్ఠంగా రూ. 46.90, గేదె పాలకు కనిష్ఠంగా రూ. 40.25, గరిష్ఠంగా రూ. 80.10 వరకు ధర వస్తుంది. కల్వకుర్తి, కుప్పగండ్ల, కొండారెడ్డిపల్లి, గుండూరు, మాదారం, వెల్దండ, ఊర్కొండపేట, నాగర్‌కర్నూల్‌లోని ఈ కేంద్రాల ద్వారా పాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే రైతులకు డబుల్ అకౌంట్లు, ఫేక్ అకౌంట్లు ఉన్నాయనే సాకుతో నాలుగేళ్లుగా ప్రోత్సాహక సొమ్మును నిలిపివేశారు.

ప్రభుత్వానికి ఉండే యంత్రాంగం ద్వారా వీటన్నింటినీ సరిచేసే అవకాశాలున్నా ఇప్పటి వరకు నాన్చివేత ధోరణిని అవలంభిస్తుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నెల బిల్లులకు సైతం ఇక్కట్లు

ప్రోత్సాహకానికి సంబంధించిన డబ్బులు రూ.35 కోట్లు పెండింగ్‌లో ఉండగా నెలలో రెండు సార్లు ఇవ్వాల్సిన రెగ్యులర్ బిల్లులు కూడా దాదాపు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉండటం పట్ల పాడి రైతుల్లో అసహనం వ్యక్తమవుతోంది. విజయ డెయిరీ ద్వారా జిల్లాలో సేకరిస్తున్న దాదాపు 95వేల లీటర్ల పాలకు సంబంధించి ప్రతీ 15 రోజులకొకసారి 7 నుంచి ఏడున్నర కోట్ల రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉంది. 15 రోజులకొకసారి సాధారణ బిల్లుల ప్రక్రియ ముగించాల్సి ఉండగా గడిచిన ఐదు నెలల నుంచి బిల్లుల చెల్లింపులో తాత్సారం జరుగుతోంది. దీని కారణంగా నిర్వహణ భారంతో రైతులు అగచాట్లకు గురవుతున్నారు.

బిల్లుల చెల్లింపు సకాలంలో లేకపోవడంతో వడ్డీలకు డబ్బులు తెచ్చి పాడి పరిశ్రమను నిర్వహిస్తున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

మాటిచ్చాం.. రూ. రెండు లక్షల రుణమాఫీ చేశాం



పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ చేస్తున్న మంత్రి పొన్నం, సంపత్, సరిత

» ఐదేళ్లలో లక్షమాఫీ చేయనోడికి మాట్లాడే అర్హత లేదు
» ప్రమాణ స్వీకారోత్సవంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం
» సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణలో మంత్రి

● వివరాలు 6వ పేజీలో...

నేల దిగిన సూరీడు



ఆకాశం రంగులద్దుకున్నది. అప్పటి వరకు కురిసిన వర్షం వెలియడంతో సూర్యుడు బంగారు వర్ణంలోకి మారాడు. సాయం సంధ్యవేళ ఆకాశమంతా పరుచుకున్న ఆ భానుడి కిరణాల వెలుగులు నేలను తాకి ప్రతిబింబించాయి. దాంతో పట్టణమంతా బంగారు వర్ణాన్ని పులుముకున్నట్లు వెలుగులీనింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో శుక్రవారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- అచ్చంపేట(ఆంధ్రజ్యోతి)

కేఎల్ఐ డీ-82 కాలువకు మళ్లీ గండి

» ఎనిమిదోసారి తెగిన కెనాల్
» వెల్దండ మండలంలో ఘటన

7



వృథాగా పోతున్న నీరు

కుంచె కదిలితే అద్భుతం

» చిత్రకళలో ప్రతిభ చూపుతున్న సానియా
» స్వయంకృషితో రాణింపు
» రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలకు వారి చిత్రపటాల అందజేత

7



సానియా వేసిన పెయింటింగ్‌లు

పీయూ వీసీగా నర్సయ్య శ్రీనివాస్

● వర్సిటీ అభివృద్ధికి కృషి
● విద్యా ప్రమాణాలను బలోపేతం చేస్తా
● వృత్తి విద్య, ఉపాధి కోర్సులకు ప్రాధాన్యం
● వ్యవసాయ కుటుంబం నుంచి వీసీ దాకా
● నేడు బాధ్యతల స్వీకరణ

6



క్రీడాకారులను ప్రోత్సహించేందుకు

ముఖ్యమంత్రి కప్

» సీఎం కప్ టార్చ్ ర్యాలీకి ఘనంగా స్వాగతం పలికిన కలెక్టర్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ టార్చ్ ర్యాలీ నల్గొండ జిల్లా నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణానికి శుక్రవారం చేరుకోగా సీఎం కప్ టార్చ్ ర్యాలీకి కలెక్టర్ బదావత్ సంతోష్ స్వాగతం పలికారు. అనంతరం ఈ ర్యాలీ జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ దాకా కొనసాగిన సీఎం కప్ ర్యాలీలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సుమారు 600మంది విద్యార్థినీ విద్యార్థులు, క్రీడాకారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేయాలన్న సంకల్పంతో గ్రామీణస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ఈ క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉండే క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని రాష్ట్ర, జాతీయ, ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే ప్రయత్నమే సీ ఎం కప్ ఉద్దేశమన్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం, వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, పలు రకాల క్రీడా అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కమీషన్ల కక్కుర్తి!



తుమ్మిళ్ల వద్ద నిలిచిపోయిన టీఎస్ఎండీసీ ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్ కేంద్రం

» నిలిచిపోయిన టీఎస్ఎండీసీ ఇసుక కేంద్రం
» భారీగా ఆదాయం కోల్పోతున్న ప్రభుత్వం » నాయకులు, పోలీసులకు మామూళ్లు

మేము సిద్ధంగా ఉన్నాం

ఇసుక డంపును ఓపెన్ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అయితే కాంట్రాక్టర్‌కు కొన్ని సమస్యలు ఉన్నాయి.. ప్రారంభిస్తే సమస్యలు వస్తున్నాయంటున్నారు. వాటిని పరిష్కరించే మార్గాలు చూస్తున్నాడు. ఆయన నుంచి సాధ్యం కావడం లేదు. మరో సారి చెప్పి సాధ్యం కాకపోతే ప్రత్యామ్నాయ మార్గం ఆలోచిస్తాం.

- రంగారెడ్డి, టీఎస్ఎండీసీ ప్రాజెక్టు ఆఫీసర్

గద్వాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక దొరకని స్థితి ఏర్పడింది. గత ఐదు నెలలుగా టీఎస్ఎంసీడీ ఆధ్వర్యంలో నిర్వహించే ఇసుక కేంద్రం మూతపడింది. నాయకుల కమీషన్ కక్కుర్తికి నిర్వాహకులు తట్టుకోలేక మూతపెట్టారు. దీంతో ఇసుక దొరకక నిర్మాణాలు నెమ్మదించాయి. దీంతో ఇసుకకు భారీగా డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా భావించి అక్రమార్కులు ఇసుక రవాణాకుతెరలేపారు. నాయకులకు, పోలీసులకు మామూళ్లు ఇచ్చి అక్రమంగా ఇసుకను జిల్లా కేంద్రానికి తరలించి రూ. లక్షల్లో సంపాదిస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు అంత ధర చెల్లించలేక నిర్మాణాలు ఆపేశారు. ప్రభుత్వ పనులు కూడా నెమ్మదించాయి. ఈ విషయం కలెక్టర్, ఎస్పీలకు తెలిసినా వాళ్లు కూడా ఆ నాయకుడి కనుసన్నల్లో పనిచేస్తుండటంతో ఏమి చేయలేని దుస్థితిలో ప్రజలున్నారు.

తెలిసినా.. ఏమిచేయలేని ప్రభుత్వం

టీఎస్ఎండీసీ ఇసుక డంపింగ్ కేంద్రం మూత పడిన విషయం ప్రభుత్వంతో పాటు కలెక్టర్, ఎస్పీలకు తెలిసినా ఏమిచేయలేని స్థితిలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరుల లెక్కల పరిశీలనలో తుమ్మిళ్ల టీఎస్ఎంసీడీ కేంద్రం మూతపడిన విషయం బయటపడింది. దీంతో ప్రభుత్వ పెద్దలు దీనిపై ఇంటెలిజెన్స్ అధికారులతో విచారణ చేయించారు. అందులో ఓ నాయకుడి కమీషన్ దందా బయట పడటంతో పాటు భారీగా కమీషన్ డిమాండ్ చేసిన విషయం పొక్కినట్లు తెలుస్తున్నది. ఇది ఇచ్చుకోలేక మూతపెట్టినట్లు విచారణలో బయటపడినట్లు తేలింది. ఇదే విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం అవుతున్నది.

టీఎస్ఎండీసీ ఇసుక కేంద్రం మూత

ఉమ్మడి జిల్లా ప్రజలు, ప్రభుత్వ అవసరాల కోసం రాజోళి మండలం తుమ్మిళ్ల గ్రామం వద్ద టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత మూడేళ్లుగా దీని ద్వారానే ఇసుక అవసరాలు తీరుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుంది. అయితే గత ఐదు నెలలుగా ఈ ఇసుక కేంద్రం మూతపడింది. రాజకీయ నాయకుడి కమీషన్ కక్కుర్తికి నిర్వాహకులు తట్టుకోలేక పోతున్నారు. మొదట ఇచ్చిన కమీషన్ కంటే రెండింతలు పెంచాల్సిందేనని హుకుం జారీ చేయడంతో ఎడారికి పోయి ఇసుక వ్యాపారం చేయొచ్చేమో కానీ ఇక్కడ చేయలేమని చేతులెత్తేసి మూత పెట్టారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇసుక దొరకక ప్రజలతో పాటు ప్రభుత్వ పనులు చేసే కాంట్రాక్టర్లు పనులు ఆపేసి ఇసుక కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో అక్రమంగా ఇసుక దందా..

దీనిని అదునుగా చూసి ఇసుక అక్రమ దందా మొత్తం ఆ నాయకుడి ఇంటితలుపు తట్టినట్లు తెలుస్తున్నది. ఓకే చెప్పడంతో గత మూడు నెలలుగా రాత్రిళ్లలో జిల్లా కేంద్రానికి ఇసుక అక్రమ రవాణ కొనసాగుతున్నది. ఇసుకకు డిమాండ్ ఉండటంతో భారీగానే మొత్తం వెనకేసుకుంటుంది. ఈ విషయం గద్వాల నాయకులకు కూడా తెలియడంతో వాళ్లు పోలీసుల సహాయంతో మొదట అడ్డుకున్నారు. రెండుమూడు పర్యాయాలు ఇసుక టిప్పర్లను పట్టుకొని కేసులు నమోదుచేశారు. ఆ తర్వాత నాయకులతో లెక్కలు పూర్తయిన తర్వాత యథాతథంగా అక్రమ రవాణ కొనసాగుతున్నది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా వరిని కొనుగోలు చేసేందుకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఐడీవోసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు రూపొందించుకున్న ప్రణాళిక, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, తదితర అంశాలను అధికారులు వివరించారు. వనపర్తి జిల్లాలో 297 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 4 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తించడంలో అవగాహన తప్పనిసరి

సన్న రకం వరి ధాన్యానికి సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న రకానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తుందని, రైతులకు నష్టం కలగకుండా వాటిని సరిగా గుర్తించాలని చెప్పారు. పౌర సరఫరాల శాఖ డీఎం ఇర్ఫాన్, డీసీవో ప్రసాద రావు, డీసీఎస్‌వో కాశీవిశ్వనాథ్, డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, సివిల్ సప్లయ్ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ఈర్లదిన్నెలో

జాతీయ బృందం పర్యటన

» రికార్డులు, అభివృద్ధి పనుల పరిశీలన

అమరచింత, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో శుక్రవారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ టీం పర్యటించింది. ఈ సందర్భంగా నేషనల్ టీం సభ్యులు ప్రవీణ్ పాటిల్ ఆధ్వర్యంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, నిధుల విడుదల, ఇది వరకు ఖర్చయిన నిధులు, జరిగిన అభివృద్ధి, గ్రామ పంచాయతీలలోని రికార్డులు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు, మహిళా సంఘాల ద్వారా అందుతున్న పథకాలు, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులు, పనుల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులను జాతీయ బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ నిర్వహణ సిబ్బంది పనితీరు, క్షేత్రస్థాయిలో ఉన్న ప్రత్యేక అధికారుల పని తీరు తదితర వాటిపై వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రతీ మండలంలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకొని అభివృద్ధిని, పథకాల పనితీరును, పంచాయతీ కార్యాలయ నిర్వహణ తదితర వాటిని పరిశీలించి క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ బృందంతో పాటు డీఆర్‌డీఏ పీడీ ఉమాదేవి, అడిషనల్ డీఆర్‌డీఏ నాగేంద్రం, ఏపీడీ సుల్తాన్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో నరసింహయ్య, సమైక్య ఏపీఎం శ్రీనివాసులు, గ్రామస్థులు చుక్క ఆశిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



అమరచింత మండలం ఈర్లదిన్నె గ్రామ పంచాయతీలో రికార్డులు తనిఖీ చేస్తున్న నేషనల్ టీం సభ్యులు



కోచ్‌ల నియామకం కోసం ప్రతిపాదనలు

మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు ఇండోర్ స్టేడియంలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని మైదానంలో మల్టీ పర్పస్ మైదానం, ఎంవీఎస్ కళాశాలలో, సీసీ కుంట మండలంలోని అల్లీపూర్‌లో ఇండోర్ స్టేడియాలున్నాయి. కోచ్‌లు లేకపోవడంతో సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోంది. కోచ్‌ల నియామకం కోసం ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటాం.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్



మక్తల్ ఇండోర్ స్టేడియం

ఆటలాడేదెలా?

- దిష్టిబొమ్మల్లా ఇండోర్ స్టేడియాలు
- నిర్వహణ లోపంతో అవస్థలు
- కోచ్‌లు లేక శిక్షణ కరువు
- నిరాశ చెందుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 18: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాలు ఆలనా పాలన లేక నిరుపయోగంగా మారుతున్నాయి. కోచ్‌లతో పాటు, నిర్వహణా సిబ్బంది లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. స్వయంగా క్రీడాకారుడైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడా రంగానికి పెద్దపీట వేస్తున్నారు. క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉంది. అలాగే అవసరమైన సిబ్బందిని, కోచ్‌లను నియమించి క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది.

నిర్మించి వదిలేశారు..

బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, హ్యాండ్‌బాల్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో విద్యార్థులు, యువతీ యువకులు సాధన చేసేందుకు, శిక్షణ పొందేందుకు నిర్మించిన ఈ ఇండోర్ స్టేడియంలో నిర్వహణా లోపంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, నారాయణపేట జిల్లాలోని మక్తల్, మహబూబ్‌నగర్ జిల్లాలోని అల్లీపూర్, జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి, వనపర్తి జిల్లా కేంద్రాల్లో ఇండోర్ స్టేడియాలను నిర్మించి వదిలేశారు. వాటన్నింటినీ వినియోగంలోకి తెస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. శిక్షణ పొంది, సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉమ్మడి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తెచ్చే అవకాశమూ ఉంది.

మహబూబ్‌నగర్ జిల్లాలో..

మహబూబ్‌నగర్ పట్టణంలో మల్టీపర్పస్ ఇన్‌డోర్ స్టేడియాన్ని గత ఏడాది ప్రారంభించారు. అందులో ఆరు షటిల్ కోర్టులు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం షటిల్ సంఘం ఆధ్వర్యంలో, సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం క్రీడాకారులు సాధన చేస్తున్నారు. సీనియర్ క్రీడాకారులతో పాటు ఫిట్నెస్ కోసం వచ్చే వారు యువజన క్రీడల శాఖ నిర్దేశించిన రుసుం చెల్లించి సాధన చేస్తున్నారు. ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఇన్‌డోర్ స్టేడియం నిర్మించి వదిలేశారు. ఇక్కడ కూడా కోచ్‌ను నియమించలేదు. సీనియర్ క్రీడాకారులు మాత్రం సాధన చేస్తున్నారు. జిల్లాలోని చిన్నచింతకుంట మండలం అల్లీపూర్‌లో ఇండోర్ స్టేడియం నిర్మించారు. మొదట్లో ప్రైవేట్‌గా ఓ సీనియర్ క్రీడాకారుడిని శిక్షకుడిగా నియమించి, గ్రామంలోని యువత, చిన్నారులకు శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత అతడు మానేయడం, స్టేడియం నిర్వహణ కరువవడంతో తాళం వేసేశారు.

నియోజకవర్గానికి ఒక స్టేడియం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో నియోజకవర్గానికి ఒక ఇన్‌డోర్ స్టేడియం ఉండాలన్న లక్ష్యంతో కల్వకుర్తి, మక్తల్ పట్టణాల్లో నిర్మించారు. కానీ యువజన క్రీడల శాఖ నుంచి సరైన కోచ్‌లు, వాచ్‌మెన్లు, గ్రౌండ్‌మెన్లు లేక నిర్వహణను గాలికి వదిలేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాలతో వాటిని వసతి గృహాలకు అప్పగించారు. మక్తల్ పట్టణంలోని ఇన్‌డోర్ స్టేడియంలో డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. కల్వకుర్తిలోని ఇండోర్ స్టేడియంలో వసతి గృహం కొనసాగుతోంది. వనపర్తిలో రెండు ఇండోర్ స్టేడియాలు ఉండగా, ఒక స్టేడియంలో జేఎన్‌టీయూ కళాశాల నిర్వహిస్తున్నారు.

మరో స్టేడియంలో నిన్న మొన్నటి వరకు మునిసిపల్ కార్యాలయం నిర్వహించారు. ఇటీవలే మైదానాన్ని యువజన క్రీడల శాఖ స్వాధీనం చేసుకున్నది. కొల్లాపూర్, అచ్చంపేట, ఎర్రవల్లి చౌరస్తాల్లోని స్టేడియాల పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉంది.

కోచ్‌లు, నిర్వహణా సిబ్బంది లేక నిరుపయోగంగా మారాయి.



వనపర్తి ఇండోర్ స్టేడియం

జాతీయ రహదారి బైపాస్ పనుల పరిశీలన



సింగోటం క్రాస్ రోడ్డు వద్ద బైపాస్ పనులను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు, కొల్లాపూర్ సింగోటం చౌరస్తాలో జరుగుతున్న బైపాస్ పనులను శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. అంతకుముందు కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చౌటబెట్ల గ్రామానికి వెళ్లే దారిలో ఎస్టీ గిరిజన వసతి గృహం వద్ద వాగుపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ ఎత్తును పెంచాలని మంత్రి జూపల్లికి గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులు లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చౌటబెట్ల గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై ఫ్లైఓవర్ ఎత్తు పెంచాలని హైవే అధికారులను మంత్రి జూపల్లి ఆదేశించారు. అనంతరం పట్టణంలోని సెయింట్‌మెరీ పాఠశాల సమీపంలో కొనసాగుతున్న బైపాస్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ రాజశేఖర్ గౌడ్, కమలాకర్‌రావు, హైవే అధికారులు తదితరులు ఉన్నారు.

తల్లి మందలింపుతో కుమారుడి ఆత్మహత్య

వీపనగండ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుల వెంట తిరగడం మంచిది కాదని తల్లి మందలించడంతో కుమారుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం అమ్మాయిపల్లి గ్రామంలో ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి లక్ష్మి, బాలపీరు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు బాలచందర్ (20) పదవ తరగతి వరకు చదివి ఇంటి దగ్గరే ఉంటున్నాడు. రోజూ స్నేహితుల వెంట తిరుగుతూ ఇంటికి రావడం, వెళ్లడం జరిగేది. పని చేసుకోవాలని బయట స్నేహితుల వెంట గాలి తిరుగుడు తిరగడం మంచిది కాదని తల్లి లక్ష్మి కుమారుడిని మందలించింది. ఇలా తిరిగే తండ్రి కూడా లేకుండా పోయాడని హెచ్చరించింది. దీంతో ఈ నెల 16న తల్లి లక్ష్మితో గొడవ పడిన బాలచందర్ బైకు తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ తరువాత కనిపించకపోవడంతో అతని ఆచూకీ కోసం కుటుంబీకులు వెతికారు. శుక్రవారం వీపనగండ్ల శివారులోని అమ్మాయిపల్లి రోడ్డుపై బైకు కనిపించింది. ఆ చుట్టుపక్కల గాలించగా ఓ రైతు పొలంలో మోత్క చెట్టుకు ఉరి వేసుకొని శవమై శుక్రవారం కనిపించాడు. ఉన్న ఒక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాణి తెలిపారు.

పీయూ వీసీగా జీ నర్సయ్య శ్రీనివాస్

● నేడు బాధ్యతల స్వీకరణ

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 18: పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా గోండ్లల నర్సయ్య శ్రీనివాస్ నియమితులయ్యారు. గవర్నర్ రాజ్‌భవన్ నుంచి ఈ మేరకు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. నర్సయ్య శ్రీనివాస్‌ది రాజన్న సిరిసిల్ల జిల్లా గంబిరావుపేట మండలం కొత్తపల్లి గ్రామం. వ్యవసాయ కుటుంబ నుంచి వచ్చారు. పాఠశాల నుంచి పీహెచ్‌డీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదివారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు స్వగ్రామంలో చదువుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధిక మార్కులు రావడంతో అప్పటి ఎన్‌టీఆర్ ప్రభుత్వంలో తెలుగు విజ్ఞాన్ పరితోషికాన్ని అందుకున్నారు. ఇంటర్, డిగ్రీ కామరెడ్డి ప్రభుత్వ కళాశాలల్లో పూర్తి చేశారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూలో బీటెక్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ చదివారు. జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ చేసి, డాక్టరేట్ పొందారు. మొదట్లో ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకులుగా పని చేశారు. అనంతరం ఓయూలో టెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, జేఎన్‌టీయూలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్, సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. జేఎన్‌టీయూలో పరిపాలన పరమైన అన్ని విభాగాల్లో పని చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో ఆరుగురికి డాక్టరేట్ వచ్చేలా కృషి చేశారు. ప్రస్తుతం ఎనిమిది మందికి స్కాలర్‌లకు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో అనేక పుస్తకాలను రాశారు.

విద్యా ప్రమాణాలను బలోపేతం చేస్తా

పీయూ వీసీగా బాధ్యతలను స్వీకరించనున్న జీఎన్ శ్రీనివాస్ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వర్సిటీలో విద్యా ప్రమాణాలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్సిటీలో ఇంజనీరింగ్, లా కళాశాలల ఏర్పాటుకు కృషిచేస్తానని అన్నారు. వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెడతామన్నారు. విద్యార్థులకు ఉపాధి కల్పించే కోర్సులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీఎం సహకారంతో అధిక నిధులు తెచ్చి వర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని చెప్పారు.

మాటిచ్చాం.. రూ. రెండు లక్షల రుణమాఫీ చేశాం

- ఐదేళ్లలో లక్షమాఫీ చేయనోడికి మాట్లాడే అర్హత లేదు
- ప్రమాణ స్వీకారోత్సవంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి



గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గద్వాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): "ఎన్నికల సమయంలో రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తాం అని మాటిచ్చాం.. మాఫీ చేసి మాట నిలబెట్టుకున్నాం... రూ. రెండు లక్షల పైన ఉన్న రైతులకు రెండు లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉంది.. వాటిని కూడా చేస్తాం. ఐదేళ్లలో రూ.లక్ష మాఫీ చేయనోడు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదు. మిగులు రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల అప్పులపాలు చేశాడు.. పోయే ముందు రూ.40వేల కోట్ల బిల్లులు చెల్లించలేదు. ఇవన్నీ మాకు ఆర్థిక భారమైనా ఇచ్చిన హామీలను నెరవేర్చామని" రవాణ, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం గద్వాలలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణతో పాటు గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గద్వాలకు మొదటిసారి వచ్చిన మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. కలెక్టర్ కార్యాలయం నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గజమాలతో సత్కరించారు. విగ్రహావిష్కరణ అనంతరం కృష్ణవేణి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణలో నియంతృత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాడి ప్రజాపాలన ప్రభుత్వంను ఏర్పాటు చేసిందని వివరించారు. త్వరంలో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించారు. రూ. రెండు లక్షల రుణమాఫీ చేసే క్రమంలో రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్న రైతులకు ఇంకా మాఫీ కాలేదని వాళ్లు పైన ఉన్న రుణం బ్యాంకుకు చెల్లిస్తే మాఫీ చేస్తామని వివరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో చేసిచూపించామని ప్రజలకు ధైర్యంగా చెప్పాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లావారే కావడంతో ఇక్కడి రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలు పూర్తికావడంతో పాటు రైతాంగ సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు.

సర్దార్ సర్వాయి పాపన్న వారసులం..

మనమందరం సర్వాయి పాపన్న వారసులం.. ఇప్పుడే విగ్రహావిష్కరణ చేసుకున్నాం.. నా చేతుల మీదుగా ఇంతటి మహానుభావుడి విగ్రహావిష్కరణ చేయడం నాకు సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. గ్రంథాయం చైర్మన్‌గా ప్రమాణం చేసిన నీలి శ్రీనివాసులు పోటీ పరీక్షలకు యువతీ యువకులను తయారు చేయించి ఉద్యోగ అవకాశాలు వచ్చేలా గ్రంథాలయం నడిపించాలని ఆయన సూచించారు.

కుట్రలు కుతంత్రాలు ఎదిరించి..

విగ్రహావిష్కరణ, ప్రమాణ స్వీకారోత్సవంకు ఎన్నో కుట్రలు కుతంత్రాలు జరిగాయి.. అన్నింటిని ఎదురించి విజయవంతం చేశారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. గద్వాలలో అతిపెద్ద జనాభా ఉన్నది వాల్మీకులు, కురువలు.. వారితో పాటు ఇతర కులాలు ఉన్నాయని వారందరికీ ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని వివరించారు.

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, టీపీసీసీ సభ్యుడు గంజిపేట శంకర్, పట్టణ అధ్యక్షుడు ఇసాక్, అధికార ప్రతినిధి షేక్షావలి చారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

దూరంగా.. ఎమ్మెల్యే వర్గం

కాగా, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ, గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరు కాలేదు. ఆయన వర్గం కూడా ఎవరూ పాల్గొనలేదు. నియోజకవర్గంలో మంత్రి పర్యటన ఉన్నపుడు ఆయనకు సమాచారం ఇవ్వడం జరుగుతుంది. ఆయన ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో గద్వాలలో చర్చ జరుగుతుంది.

మేక పిల్లల మందపై కుక్కల దాడి

● చనిపోయిన నాలుగు మేక పిల్లలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామానికి చెందిన దేవరపాగ మహేశ్, దేవరపాగ నాగరాజులకు చెందిన మేక పిల్లల మందలపై శుక్రవారం కుక్కలు దాడి చేశాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న మందపై కుక్కలు దాడి చేయడంతో, నాలుగు మేక పిల్లలను చనిపోయాయి. మరో ఆరు మేక పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తమకు రూ. 40 వేల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి టౌన్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి న్యాయాధికారి జైలుశిక్ష, జరిమాన విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన మహమ్మద్ అశ్రఫ్ అనే వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. ఆయనను శుక్రవారం కల్వకుర్తి కోర్టులో పరచగా, న్యాయాధికారి కావ్య అతడికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.500 నగదు జరిమాన విధించినట్లు ఎస్ తెలిపారు.

కోయనగర్‌లో కోటిన్నర దుర్వినియోగం

● బ్యాంకు అధికారి పాత్రపై అనుమానం ● సీవో సస్పెన్షన్, ఆర్‌పీపై కేసు

పాలమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒక్కో రూపాయి పొదుపు చేసుకుని జీవితంలో ఎదిగేందుకు మహిళా సంఘాలు పని చేస్తున్నాయి. సంఘాలకు ప్రభుత్వం బాసటగా నిలుస్తూ బ్యాంకుల్లో తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేలా ప్రోత్సహిస్తోంది. రుణాలు సకాలంలో చెల్లించిన వారిని ప్రోత్సహిస్తూ పెద్ద మొత్తంలో బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. రుణమిచ్చేటప్పుడు మహిళా సంఘాల సభ్యుల అందరి ముందు ఇవ్వటం, అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నాకే రుణాలు ఇస్తారు. చదువురాని మహిళలను టార్గెట్ చేసుకున్న ఆర్‌పీ శ్రీలత, బ్యాంకు అధికారి సహకారంతో రూ.కోటి 49 లక్షల 36 వేల 205 దుర్వినియోగం చేయటం ఆశ్చర్యమేస్తోంది. సంఘాల సభ్యులను ఎవరినీ పిలవకుండా కేవలం ఆర్‌పీ శ్రీలత చెప్పిందే తడవుగా బ్యాంకు అధికారి అంతమొత్తం డబ్బు ఎందుకు ఇచ్చారనేది అంతు చిక్కని ప్రశ్న. కోయనగర్‌లో మొత్తం 33 సంఘాలు ఉన్నప్పటికీ అందులో ఎనిమిది సంఘాల సభ్యులు ఆమెను నమ్మలేదు. స్వతహాగా అన్ని పనులు చేసుకొని అవకతవకలకు తావు లేకుండా ఉన్నారు. మిగిలిన సంఘాల్లో చదువులేని సభ్యులతో ఆర్‌పీకి లాభం చేకూరింది. ఒక సంఘం తరఫున రూ.10 లక్షల వరకు రుణం తీసుకుని వారి అకౌంట్లో వేసినట్లే వేసి మరునాడు తీసుకుంది. ఆర్‌పీ ఒక్కరే ఇంతగా డబ్బు స్వంతానికి వాడుకోవటానికి సహకారం అందించింది మాత్రం బ్యాంకు అధికారి అనేది స్పష్టం. జిల్లాలో మహబూబ్‌నగర్-2731, బాదేపల్లి-617, భూత్పూర్-272తో కలిపి 3620 మహిళా సంఘాలు, 45 దివ్యాంగుల సంఘాలు(పర్సన్ విత్ డిసెబిలిటీ-పీడబ్ల్యూడీ)మొత్తం కలిపి 3665 సంఘాలు పనిచేస్తున్నాయి.

మోసం బయట పడిందిలా...

సెప్టెంబర్ నాలుగో తేదీన కోయనగర్‌లో రమాదేవి మహిళా సంఘం నుంచి రూ.10 లక్షలు తీయటంతో రమాదేవి ఆర్‌పీ శ్రీలతను ప్రశ్నించారు. పొరపాటున మీ అకౌంట్ నుంచి డబ్బు తీశాం.. మళ్లీ వేస్తామని నాలుగు రోజులు గడిపింది. అయినా తీసిన డబ్బును అకౌంట్‌లో డబ్బు జమచేయక పోవటంతో ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ అధికారులను కలిశారు. అప్పుడు మరొకరి అకౌంట్ నుంచి ఆ డబ్బును రమాదేవి అకౌంట్‌లో వేసింది. ప్రశ్నించేవాళ్లాంటికే ఇలా చేస్తే మిగిలిన చదువురాని వారిని ఏం చేశారనే అనుమానంతో అందరి అకౌంట్‌లు పరిశీలించి జిరాక్స్‌లు తీయిస్తే విషయమంతా బయటికి వచ్చింది. ఇందులో కేవలం శ్రీలతతో పాటు బ్యాంకు అధికారి వాటా ఉన్నట్లు అనుమానం వ్యక్తం అవుతోంది. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఆర్‌పీ శ్రీలత, బ్యాంకు అధికారి ఇద్దరినీ విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని మహిళలు చెబుతున్నారు. మొత్తం 28 మహిళా సంఘాల నుంచి రూ.కోటి 49 లక్షల 36 వేల 205 మోసం జరిగినట్లు గుర్తించారు.

సీవో యాదయ్య సస్పెన్షన్

పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగినా సీవో కరెక్టు మానిటరింగ్ చేయలేదు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు కమ్యూనిటీ ఆర్గనైజర్(సీవో) యాదయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి ఆర్‌పీ శ్రీలతపై క్రిమినల్ కేసు బుక్ చేయాలని కలెక్టర్ మునిసిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

కలెక్టరేట్‌లోకి మెప్మా పీడీ కార్యాలయం

కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యల్లో భారీ మొత్తంలో పొదుపు సొమ్ము, రుణాల పద్దులు దుర్వినియోగమైన నేపథ్యంలో జిల్లా అధికారులు మెప్మా పీడీ కార్యాలయాన్ని కలెక్టరేట్‌లోకి మారబోతోంది. ఇన్‌చార్జి పీడీ, అదనపు కలెక్టర్‌లు చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

మాకేమివ్వకుండా మాపేర రుణం తీసుకుంది..

మాకేమీ ఇవ్వకుండా మాపేరుపై ఆమె రుణాలు తీసుకుంది. మొత్తం 33 స్వయం సహాయక సంఘాలు, ఒకటి గ్రామ సంఘం పెద్దది. ఎవరికీ ఏమివ్వకుండా రుణాలు తీసుకుని సొంతానికి వాడుకున్నది.

- అరుణ, కోయనగర్

మేము గుర్తు పట్టి అప్రమత్తం చేసినం

మా సంఘం అకౌంట్ నుంచి మాకు తెలియకుండా రూ.10 లక్షలు తీయటమేమిటని నిలదీస్తే మరొకరి అకౌంట్ నుంచి ఆడబ్బు రికవరీ చేసింది. అనుమానం వచ్చి అందరి అకౌంట్‌లు పరిశీలిస్తే మోసమంతా బయటపడింది. ఈరోజు ఎస్పీ, రూరల్ పోలీస్‌స్టేషన్, ఎమ్మెల్యేను కలిసి విషయం చెప్పినం.

- రమాదేవి, కోయనగర్

అవినీతిపై ఉక్కుపాదం

- ● అక్రమాలకు పాల్పడ్డ వారిపై ఉన్నతాధికారులకు జడ్చర్ల ఎమ్మెల్యే ఫిర్యాదు
- ● పరిశీలించి, నివేదికలు ఇచ్చిన అధికారులు
- ● ఇద్దరు అధికారుల సస్పెన్షన్



ఆక్రమణకు గురైన బాలానగర్ మండలంలోని పెద్ద

జడ్చర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రారంభం దశలోనే అవినీతిని నియంత్రించకపోవడంతో అదే అధికారులకు శాపంగా మారింది. స్వీయ నియంత్రణ లేకపోతే అనర్థాలకు దారి తీస్తుందని సస్పెండ్ అయిన అధికారులకు తీరు అద్దం పడుతుంది. జడ్చర్ల నియోజకవర్గంలో అవినీతికి తావు లేదని, అవినీతిపై ఉక్కుపాదం మోపుతానంటూ పలు సందర్భాలలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి బహిరంగంగానే హెచ్చరించాడు. అవినీతి అధికారులపై ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులపై విచారణ చేపట్టిన అనంతరం వారిపై వేటు వేశారు. ఒకరేమో ప్రైవేట్ సంస్థకు రూ.5.12 కోట్ల సీనరేజ్ రుసుము చెల్లించాలంటూ తాను జారీ చేసిన నోటీసులనే రద్దు చేసి అడ్డంగా బుక్కయ్యాడు. మరొకరేమో పాలకవర్గంతో కుమ్మక్కై ఏకంగా రూ.1.73 కోట్ల అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రారంభంలోనే అక్రమాలను నియంత్రించి, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించి ఉంటే సదరు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యేవాళ్లు కాదంటూ జడ్చర్ల నియోజకవర్గంలో ప్రస్తుతం సర్వత్రా చర్చజరుగుతోంది.

పెద్ద చెరువు కాల్వ కబ్జా

నియోజకవర్గంలోని బాలానగర్ మండలం పెద్ద చెరువు కింద ఉన్న కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు మళ్లించి భూమిని కబ్జా చేశారని, దీంతో ఆ ప్రాంతంలో ఉన్న రైతుల భూములు నీట మునిగే పరిస్థితి నెలకొందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చెప్పారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని ఏప్రిల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ అంశంలో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ప్రైవేట్ సంస్థతో కుమ్మక్కయ్యారంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. బాలానగర్ మండల కేంద్రంలోని సర్వే నెంబరు 118/పీలో వారాహి సంస్థ చేసిన వెంచర్‌లో అక్రమంగా 1.67 లక్షల టన్నుల మట్టిని ఇతర ప్రాంతాల తెచ్చి పోశారని, ఈ దీనిపై చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్‌శాఖ అందుకు విరుద్ధంగా వ్యవహరించిందని చెప్పారు. అక్రమంగా మట్టిని తెచ్చి పోసినందుకు రూ.5.12 కోట్ల సీనరేజ్ చెల్లించాలంటూ అప్పటి జిల్లా మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ సదరు సంస్థకు నోటీసులు జారీ చేశారు. కాగా ఇతర జిల్లాకు బదిలీపై వెళ్లే ఒక్క రోజు ముందు తాను జారీ చేసిన నోటీసులను రద్దు చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దాంతో విచారణ చేపట్టిన అధికారులు మైనింగ్‌శాఖ ఏడీని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రికార్డుల ట్యాంపరింగ్

జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు రికార్డుల ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్నారంటూ ఎమ్మెల్యే ఆరోపించడంతో పాటు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను డీఎల్‌పీవో అధికారి తనిఖీ చేశారు. ఐదేళ్లలో రూ.1.73 కోట్ల అవినీతి జరిగిందంటూ ఆయన నివేదికలు ఇవ్వడంతో తాజాగా గ్రామ పంచాయతీ కార్యదర్శి శివప్రకాశ్ సస్పెన్షన్‌కు గురయ్యారు.

'పాలమూరు - రంగారెడ్డి'పై ఉద్దేశపూర్వక జాప్యం

- సీఎం నిబద్ధత నిరూపించుకోవాలి
- మాజీ మంత్రి నాగం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వక జాప్యం చేస్తోందని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన పంపుహౌస్‌ల నుంచి రిజర్వాయర్లకు నీళ్లు ఎందుకు మళ్లించడం లేదని ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై ధ్వజమెత్తారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లలో నాలుగు పంపులు రెడీ అయినా నీరు ఎందుకు నింపడం లేదని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులతో కాంట్రాక్టర్ల జేబులు నింపడం తప్ప, రైతులకు ప్రయోజనం చేకూరడం లేదని ఆరోపించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు కొలిక్కి వచ్చి, నార్లపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను కృష్ణానది జలాలతో నింపే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. డిసెంబరు ఏడున పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మూడవ నెంబరు ప్యాకేజీ వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించి ముందు చూపుతో చేసిన పనుల వల్ల జిల్లా సుభిక్షంగా ఉందన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల కాలువలు, డిస్ట్రిబ్యూటరీల పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నాగం శశిధర్ రెడ్డి, అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, బచ్చల కూర లక్ష్మయ్య, తాడూరు జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలగౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేఎల్ఐ డీ-82 కాలువకు మళ్లీ గండి

- ఎనిమిదోసారి తెగిన కెనాల్



గండి పడటంతో వృథాగా పోతున్న నీరు

వెల్దండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని కేఎల్ఐ డీ-82 కాలువకు మళ్లీ గండిపడింది. ఈ కాలువ మండలంలోని పోతేపల్లి, గుండాల, అల్లంతోటబావి, చెర్కూర్, బర్కత్‌పల్లి గ్రామాల మీదుగా ఉంది. ప్రతీ సంవత్సరం కాలువకు నీరు వదిలినప్పుడు ఎక్కడో ఒకచోట తెగిపోతూనే ఉంది. ఇలా ఇప్పటికీ ఎనిమిది సార్లు కాలువకు గండి పడింది. నాలుగు రోజుల క్రితం లక్ష్మాపురం సమీపంలో కాలువ తెగడంతో ఇరిగేషన్ అధికారులు మరమ్మతు చేశారు. దీంతో సాగునీటికి ఇబ్బందులు తొలిగాయని భావించిన రైతులకు మళ్లీ నిరాశే కలిగింది. తాజాగా గుండాల గ్రామ సమీపంలో కాలువకు శుక్రవారం ఉదయం గండి పడటంతో సాగునీరు వృథాగా పారుతోంది. కాంట్రాక్టరు నాసిరకంగా పనులు చేపట్టడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువ కట్టలు బలహీనంగా ఉండటంతో ఎగువ నుంచి నీటి ఉధృతి ఎక్కువైనప్పుడు గండ్లు పడుతున్నాయని రైతులు చెప్తున్నారు. కాలువకు గండి పడిన విషయం తెలుసుకున్న డీఈ సమ్మయ్య శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపాధికి భరోసా

- ఐటీఐని అప్‌గ్రేడ్ చేసి అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా ఏర్పాటు
- భవన నిర్మాణం, పరికరాల కోసం రూ.76 కోట్లు మంజూరు
- టాటా కన్సల్టెన్సీతో టైఅప్.. ఆరు జాబ్‌గ్యారెంటీ కోర్సులు
- ఈ నెల 23న భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మహబూబ్‌నగర్ పట్టణంలో అప్‌గ్రేడ్ చేయనున్న ఐటీఐ కళాశాల

మహబూబ్‌నగర్/ మన్ననూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూరు, కల్వకుర్తి, వనపర్తి, మహ బూబ్‌నగర్ ఐటీఐ కళాశాలలను అప్‌గ్రేడ్ చేసి ఏటీసీ కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. యువతకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి కల్పించేలా జాబ్ గ్యారెంటీ కోర్సులను ప్రవేశపెడ్తోంది. ఇందుకోసం ప్రణాళికను సిద్ధం చేసిన ప్రభుత్వం తొందరలోనే ఆయా కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించింది. అందులో భాగంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని మెట్టుగడ్డలో ఉన్న ఐటీఐ కళాశాలను అప్‌గ్రేడ్ చేసి, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం నూతన భవన నిర్మాణానికి ఈనెల 23న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేయనున్నారు.

తొలి విడతలో యువతులకు శిక్షణ

అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా తొలి విడతలో 172 మంది యువతులకు శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నారు. డిసెంబర్ లేదా జనవరిలో శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. నూతన భవన నిర్మాణం పూర్తయ్యేవరకు ప్రస్తుతం ఉన్న ఐటీఐ కళాశాలలోనే శిక్షణ కొనసాగనుంది. నూతన భవన నిర్మాణం పూర్తయిన తర్వాత కళాశాలను అందులోకి మార్చనున్నారు. మొదటి విడతలో యువతులకు, రెండో విడతలో బాలురకు శిక్షణ ఇవ్వనున్నారు. అందుకోసం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌తో టైఅప్ చేసుకున్నారు. విద్యార్థులకు శిక్షణ అనంతరం టాటా కన్సల్టెన్సీలోనే ఉద్యోగాలు ఇచ్చేలా జాబ్ గ్యారెంటీ కోర్సులను డిజైన్ చేశారు. అందులో మ్యాన్‌ఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యు ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిషియన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మ్యాచింగ్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికిల్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. మొదటి మూడు కోర్సుల కాల వ్యవధి ఏడాది కాగా, మిగతా మూడు కోర్సులలో రెండేళ్ల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

రూ.76 కోట్లు మంజూరు

అడ్వాన్స్ సెంటర్, ఎక్విప్‌మెంట్స్ కోసం ప్రభుత్వం నుంచి రూ.76 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మెట్టుగడ్డలో అత్యాధునిక హంగులతో భవనాన్ని నిర్మించనున్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఆధునిక సాంకేతిక పద్ధతిలో రూపొందించిన పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. శిక్షణ ఇచ్చేందుకు ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించుకునే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. భవన నిర్మాణాన్ని మొదలుపెట్టి ఆరు నెలల్లో పూర్తి చేయాలని భావిస్తున్నారు. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న కళాశాల భవనంలో శిక్షణ తరగతులను ప్రారంభించనున్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా పాలమూరు



పాలమూరును ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఉపయోగించుకుంటాం. పాలమూరు పట్టణంలోని ఐటీఐని అప్‌గ్రేడ్ చేసి ఆరు జాబ్‌గ్యారెంటీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. శిక్షణ అనంతరం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లోనే అందరికీ ఉద్యోగాలు వచ్చేలా కోర్సులను డిజైన్ చేస్తున్నాం. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయను న్నాం. రెండు, మూడు నెలల్లో శిక్షణా తరగతు లను ప్రారంభిస్తాం.

\- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా శిక్షణ

ఇదిలా ఉండగా మెట్టుగడ్డలోనే స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని సేకరించి అందులో పదవ తరగతి ఫెయిల్ అయిన వారి నుంచి ఉన్నత చదువులు చదివిన వారికి సైతం నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. మంత్రితో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకూ శంకుస్థాపన చేయించనున్నారు. కంప్యూటర్ కోర్సుల్లోనూ శిక్షణ ఇవ్వనున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవకాశమున్న అన్ని రకాల శిక్షణ ఇప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే నిధులతో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా వచ్చే పదేళ్లలో 20 వేల మందికి శిక్షణ వచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనున్నారు.



మన్ననూరులో నిర్మాణంలో ఉన్న ఏటీసీ కేంద్ర భవనం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం ఐటీఐలలో అప్‌గ్రేడ్ చేసిన కోర్సులను తక్కువ కాల వ్యవధిలో పూర్తి చేసుకొని, తక్షణమే ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. మన్ననూరులో ఏటీసీలో ప్రవేశానికి అన్ని కులాల వారు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చే ఏడాది కల్వకుర్తి ప్రభుత్వ ఐటీఐలోనూ కొత్త కోర్సులు ప్రారంభం కానున్నాయి.

\- జయమ్మ, ఐటీఐ కన్వీనర్, నాగర్‌కర్నూలు

ఈ ఏడాది నుంచే శిక్షణ



ఏటీసీ కోర్సుల్లో ఈ ఏడాది నుంచే శిక్షణ ప్రారంభం కానున్నది. ఏటీసీ భవన నిర్మాణం కొనసాగుతోంది. కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థులు మొబైల్ నంబరుతో ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తులను పూర్తి చేసి, పదవ తరగతి మెమో, ఆధార్, కులం, ఆదాయం, రెండు పాసుపోర్టు సైజ్ ఫొటో లను జతపరచి ఐటీఐ కళాశాలలో ఇవ్వాలి.

\- లక్ష్మణ స్వామి, ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్, మన్ననూరు

30 లోగా దరఖాస్తుల స్వీకరణ

అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, కులం, ఆదాయం, స్థానికం, బోనఫైడ్స్ ధ్రువపత్రాలతో పాటు ఫోటోలను ఆన్‌లైన్‌లో స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్‌లను 30 లోగా మహబూబ్‌నగర్ బాలికల ఐటీఐ కేంద్రంలో వాక్ఇన్ అడ్మిషన్‌కు హాజరు కావచ్చన్నారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో నవంబరు 25నుంచి నూతన కోర్సులు ప్రారంభం అవుతాయని చెప్పారు.

క్రీడాకారులు రంజీకి ఎదగాలి

- జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్
- ఉత్సాహంగా అండర్-23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



అండర్ - 23 ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు రంజీ స్థాయికి ఎదగాలని క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో వచ్చేనెల రెండు నుంచి వరంగల్, సంగారెడ్డి పట్టణాల్లో నిర్వహించే అండర్-23 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జట్ల ఎంపికలు శుక్రవారం పట్టణంలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన 70 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు జట్లను ఎంపిక చేస్తామని, వారికి ఈ నెల 21 నుంచి మ్యాచ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. అందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో తుది జట్టును ఎంపిక చేస్తామని వివరించారు. అండర్-19 టోర్నీలో జిల్లా జట్టు చక్కటి ప్రతిభ కనబరిచి రన్నర్‌గా నిలిచిందని, అండ ర్-23 టోర్నీలో చాంపియన్‌గా నిలువాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీసీఏ సభ్యులు సురేష్‌కుమార్, అశోక్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

సౌత్‌జోన్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబర్, (ఆంధ్రజ్యోతి) 18 : సౌత్‌జోన్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు (పురుషులు) శుక్రవారం పీయూ ఇండోర్ స్టేడియంలో ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ ఎంపికలకు పాలమూరు యూనివర్సిటీలోని అనుబంధంగా వున్న అన్ని కళాశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పీయూ ఫిజికల్ డైరెక్టర్లు, సెలక్షన్ కోచ్‌లు పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు ఉత్తమ క్రీడాకారులను ఆలిండియా ఎంపిక చేశారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి చెన్నైలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ క్రీడా పోటీలకు పంపించనున్నారు. కార్యక్రమంలో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ సత్యభాస్కర్ రెడ్డి, పీడీ డాక్టర్ వెంకట్ రెడ్డి, పీయూ పీడీ శ్రీనివాస్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జింకను కాపాడిన రైతులు



జింకను ఎస్ఐకి అందిస్తున్న రైతులు

నర్వ, అక్టోబర్ 18, (ఆంధ్రజ్యోతి) : కుక్కల బారిన పడ్డ జింకను రైతులు కాపాడి పోలీసులకు అప్పగించారు. శుక్ర వారం సాయంత్రం నారాయణపేట జిల్లా నర్వ మండల పరిధిలోని జక్కన్న పల్లె శివారులో పొలంలో జింక తిరుగు తుండగా, కుక్కలు దాడి చేశాయి. సమీ పంలోని రైతులు గమనించి, కుక్కలను వెళ్లగొట్టి జింకను కాపాడి నర్వ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని ఎస్ఐ కుర్మయ్య అటవీశాఖ అధికారులకు తెలిపారు. దీంతో మరికల్ రేంజి అటవీశాఖ అధికారులు వచ్చి జింకను పరీక్షించి, ఆరోగ్యంగా ఉందని తెలిపారు. అనం తరం అడవిలో వదిలేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పెద్దకొత్తపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో బైక్ దానిని ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో యువకుడు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ జే.రామచంద్రయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్ల గ్రామానికి చెందిన వడ్డె సంపంగి హనుమంతు చిన్న కుమారుడు శైలేష్(18) అదే గ్రామానికి చెందిన తెలుగు సాయికుమార్‌లు శుక్రవారం ద్విచక్రవాహనంపై వెన్నచెర్ల గ్రామం నుంచి బండరాయిపాకుల వైపు వెళ్తున్నారు. అదే మార్గంలో వెళ్తున్న నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో దాన్ని ఢీకొనడంతో కిందపడిన శైలేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే బైక్‌పై వెనుక కూర్చున్న సాయికుమార్ ప్రమాదాన్ని పసిగట్టి, ఒక్క క్షణం ముందు కిందకు దూకడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఈ సంఘటనపై మృతుడి అన్న రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మక్తల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిఇ ఉన్నాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం, టేకులపల్లి గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. టేకులపల్లి గ్రామానికి చెందిన నర్సిములు (35) గురువారం మక్తల్ నుంచి గ్రామానికి వెళ్తుండగా, టేకులపల్లి గేటు సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి వస్తున్న కారు ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య అనిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు బాలుడు



తాత, నానమ్మలతో బాలుడు

పెబ్బేరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నానమ్మ తాతయ్యలు మనవడిని బస్సు ఎక్కించారు. కానీ వారు ఎక్కలేక పోయారు. ఆ లోపే బస్సు కదలడంతో ఆందోళన చెందారు. కండక్టర్ సాయంతో పోలీసులు బాలుడిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గట్టు మండలం బోయగూడెం గ్రామానికి చెందిన సూర్య ప్రకాశ్‌రెడ్డి, రమాదేవి దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి కుమారుడు పృథ్విక్ దసరా సెలవుల్లో నానమ్మ, తాతయ్యల వద్దకు వచ్చాడు. సెలవులు అయిపోవడంతో బాలుడిని హైదరాబాద్‌లో వదిలి వచ్చేందుకు వారిద్దరూ ఎర్రవల్లి చౌరస్తాకు వచ్చారు. హైదరాబాద్ బస్సు రాగానే బాలుడిని బస్సు ఎక్కించారు. వారు ఎక్కేలోగా బస్సు కదిలిపోయింది. దీంతో వారు వెనుకనే వచ్చిన బస్సు ఎక్కారు. బస్సులో బాలుడిని గమనించిన కండక్టర్ పెబ్బేరు పోలీసులకు అప్పగించారు. వారు ఎర్రవల్లి పోలీసులకు, సమాచారం అందించారు. బాలుడి వివరాలు తెలుసుకొని కుటుంబసభ్యులకు అప్పగించారు.

కుంచె కదిలితే అద్భుతం

- చిత్రకళలో ప్రతిభ చూపుతున్న సానియా
- స్వయం కృషితో రాణింపు
- రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలకు వారి చిత్రపటాల అందజేత



సానియా వేసిన పెయింటింగ్‌లు

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఆమె కుంచె కదిలిస్తే క్యాన్వాస్‌పై అద్భుత చిత్రం ఆవి ష్కృతం అవుతుంది. ఎవరి వద్దా శిక్షణ పొందని ఆమె స్వయంకృషితో చిత్రకారిణిగా రాణిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేటకు చెందిన సానియా పట్టణంలోని చైతన్య కళాశాలలో ఇటీ వలే డిగ్రీ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే ఆమె కు చిత్రకళపై ఆసక్తి కలిగింది. పట్టణంలోని గౌతమి స్కూల్‌లో చదువుతున్న సమయంలో వార్తా పత్రికల్లో వచ్చే కార్టూన్లను వేయడంతో చిత్రకళలో తొలి అడుగులు వేసింది. బాగా వేయగలగడంతో స్కెచ్చింగ్, పెయింటింగ్‌లు వేయడం మొదలు పెట్టింది. 2021 కరోనా సమయంలో ఆమె వేసిన 'బింగో చిప్స్ ప్యాకెట్' పెయింటింగ్ అందరి ప్రశంసలు పొందింది.

ఆ తర్వాత ఆమె తన తండ్రి ఫొటోను వేశారు. అనంతరం తన సాధనను కొనసాగించిన ఆమె రాహుల్‌గాంధీ బొమ్మ వేసి, 2022లో జోడో యాత్ర సందర్భంగా ఆయనకు బహుమతిగా ఇచ్చారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు, ఆయన చిత్రపటాన్ని గీసి, 2023లో ఆయనకు బహూకరించారు. ఆ సందర్భంగా రేవంత్ ఆమెను ఎంతగానో ప్రశంసించారు. అలాగే ఎమ్మెల్యే వంశీకృష్ణ ఫొటోను కూడా గీశారు. ఆమె పెన్సిల్ స్కెచ్‌తో పాటు, ఆయిల్ పెయింటింగ్‌లు వేయడంతో రాణిస్తోంది. తాను వేసిన పెయింటింగ్‌లను, గీసిన స్కెచ్‌లను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో ఆమె ప్రతిభ అందరికీ తెలిసింది. ఈ క్రమంలో కొందరు తమ చిత్రాలను, తమ కుటుంబీకుల చిత్రాలను వేయించుకుంటున్నారని, తగిన పారితోషికం కూడా ఇస్తున్నారని సానియా 'ఆంధ్రజ్యోతి'కి తెలిపింది.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్రపటాన్ని అందిస్తున్న సానియా (ఫైల్)



రాహుల్‌గాంధీ పెన్సిల్ స్కెచ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి

- ఏపీఎం బుచ్చన్న



వీపనగండ్ల , అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బ్యాంకు లింకేజీ స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా అభి వృద్ధి చెందాలని మండల ఏపీఎం బిచ్చన్న శుక్రవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంట ర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి?

14 గ్రామ పంచాయతీలో 452 మహిళా సంఘాలు ఉన్నాయి. 19 గ్రామ సంఘాలు ఉండగా 5,002 మంది సభ్యు లుగా ఉన్నారు.

కొత్తగా ఎంతమంది సభ్యులను చేర్పించారు?

ఈ ఏడాది సోషల్ మొబలైజేషన్ కార్యక్రమంలో భాగంగా 284 మంది కొత్త సభ్యులను చేర్పాల్సి ఉంది. ఇప్పటికీ 212 మందిని సభ్యులుగా చేర్పించాం.

2024-25లో బ్యాంకు రుణాల టార్గెట్ ఎంత?

మండలంలో అన్ని మహిళా సంఘాల సభ్యులకు రూ.18 కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు రూ.10 కోట్ల రుణాలు ఇప్పించాం.

ఎన్ని స్త్రీనిధి రుణాలు అందజేశారు.

స్త్రీ నిధి ద్వారా మండలంలో రూ.కోటి 86 లక్షల రుణాలు ఇవ్వాల్సి ఉంది. కానీ 32 సంఘాలకు రూ.66,10,743 అందజేశాం.

ఇందిరా మహిళా శక్తి ద్వారా ఏ కార్యక్రమాలు చేపట్టారు?

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా పాడి పశువుల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, చిన్న వ్యాపారాల వంటి ఉపాధిని ఇచ్చే కార్యక్రమాలు చేపడుతున్నాం.

బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా గోపి

ఖిల్లాఘణపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ యువ మోర్చా మండల అధ్యక్షుడిగా గోపిని నియమిస్తూ.. బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు కొరిగల గోపి మాట్లాడారు. మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై బీజేపీలో సభ్యత్వం నమోదు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. బీజేపీ మండల నాయకులు ఆశన్న, విక్రమ్, శివశంకర్, వెంకటరమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పాన్‌గల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోప్లాపూర్, మహమ్మదాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం మండల పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో పశువులకు మండల పశువైద్యాధికారి శ్యామ్ ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువుల్లో గాలికుంటు రోగాన్ని నివారించడంతో పాటు పశువుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మండల పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, బాలేశ్వరి, బుచ్చన్న, చంద్రయ్య, శివ, కార్తీక్, వెంకటయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్ : అన్ని రకాల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్య అధికారి విజయ్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని యార్ల గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థికి సన్మానం

కొత్తకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి మేనకోడలు సరిచందన నీట్‌లో 610 మార్కులు సాధించి కాకతీయ మెడికల్ కళాశాల వరంగల్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు విద్యార్థి ఇంటికెళ్లి శాలువాతో సత్కరించి, అభినందించారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు విశ్వేశ్వర్ కౌన్సిలర్లు రాములు యాదవ్, నాగన్న సాగర్, ఖాజామైనోద్దీన్, శ్రీనివాస్‌జి పాలొన్నారు.

మెడికల్ క్యాంపు ఏర్పాటు

చిన్నంబావి : మండల పరిధిలోని అమ్మాయిపల్లిలో సీజనల్ వ్యాధులపై మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. వీపనగండ్ల ప్రాథమిక హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ విజయ చంద్రమోహన్ మాట్లాడుతూ.. బీపీ, షుగర్ క్యాన్సర్, వీటిపై సకాలంలో మందులు వాడుతూ.. యోగా, వ్యాయామం, వాకింగ్ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు.

చెరుకు రైతుల సమావేశాన్ని జయప్రదం చేయండి

అమరచింత, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : కొత్తకోట మండల కేంద్రంలో శనివారం జరిగే ఉమ్మడి జిల్లాల చెరుకు రైతుల జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని కృష్ణవేణి చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న పేర్కొన్నారు. శుక్రవారం అమరచింతలో విలేకరులతో మాట్లాడారు. చెరుకు రైతుల సమస్యలపై చర్చించడంతో పాటు నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సమావేశాన్ని ఆయా జిల్లాల చెరుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వాసారెడ్డి, అరుణ్ కుమార్, చంద్ర సేనారెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అయోమయంలో చేనేత కార్మికులు

- త్రిఫ్ట్ ఫండ్‌కు గ్రూప్ లోన్ లింక్
- లోన్ డబ్బులను పట్టుకుంటామంటున్న బ్యాంకు అధికారులు
- ససేమిరా అంటున్న కార్మికులు



డబ్బులు ఎలా తీసుకుంటారని మేనేజర్‌తో వాదిస్తున్న నేత కార్మిక నాయకులు

అమరచింత, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు గత నెల త్రిఫ్ట్ ఫండ్ చేనేతకు చేయూత పథకం డబ్బులను విడుదల చేసింది. తాజాగా బ్యాంకు అధికారులు నేత కార్మికుల ఆర్‌డీ 2 అకౌంట్‌లో డబ్బులను వేసి వారు తీసుకోక ముందే.. గతంలో తీసుకున్న వ్యక్తిగత గ్రూప్ లోన్ రుణాలకు ప్రభుత్వం విడుదల చేసిన త్రిఫ్ట్ ఫండ్‌కు లింక్ పెట్టారు. దీంతో నేత కార్మికులు ఆందోళనకు గురువున్నారు. నేత పని చేస్తూ.. తీసుకున్న గ్రూప్ లోన్ గడువు ఇంకా ఒక సంవత్సరానికి పైగా గడువు ఉన్నప్పటికీ ఇప్పుడే ఎలా పట్టుకుంటారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. త్రిఫ్ట్ ఫండ్ అకౌంట్‌లు పూర్తి అయితే తమ బ్యాంకుకు కార్మికుల రాక తగ్గుతుంది. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకే గ్రూప్ లోన్ డబ్బులను పట్టుకుంటామని బ్యాంకు మేనేజర్ పేర్కొంటున్నారు.

గ్రూప్ లోన్లు ఇచ్చింది ఇలా...

జియో ట్యాగ్ కలిగి చేనేత పనిలో ఉండే కార్మికులకు ఆత్మకూరు డీసీసీబ్యాంకు అధికారులు నలుగురు కార్మికులకు ఒక గ్రూప్ చేసింది. జాయింట్ లయబుల్స్ గ్రూప్ ద్వారా ఒక్కొక్క కార్మికుడికి రూ.50 వేల చొప్పున ఒక్కొక్క గ్రూప్‌కు రూ.2 లక్షల లోన్ ఇచ్చింది. ఇలా ఒక అమరచింతలోనే 27 గ్రూప్‌లకు గాను రూ.54 లక్షల రుణాలను జాయింట్ లయబుల్స్ గ్రూప్ కింద ఆత్మకూరు డీసీసీ బ్యాంకు రుణాలు అందించింది. ఈ రుణాలు తీసుకున్న కార్మికులు 3 సంవత్సరాల కాల వ్యవధిలో ప్రతినెల డబ్బులు కట్ట వచ్చు. ప్రస్తుతం ఈ లోన్లు ఇచ్చి 2 సంవత్సరాలు గడవక ముందే బ్యాంకు అధికారులు మొత్తం రుణం డబ్బులను చెల్లించమంటున్నారు. ప్రభుత్వం త్రిఫ్ట్ ఫండ్ విడుదల చేయడంతో ఆ డబ్బులను బకాయి ఉన్న గ్రూప్ లోన్లు పట్టుకుంటామని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. గడువు ఉండగానే డబ్బులు ఎలా పట్టుకుంటారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్రిఫ్ట్ ఫండ్ ఎలా పట్టుకుంటారు..



మూడు సంవత్సరాల కిందట ప్రారంభమైన త్రిఫ్ట్ ఫండ్ పథకానికి గతేడాది తీసుకున్న గ్రూప్ లోన్ లకు డీసీసీ బ్యాంకు అధికారులు లింక్ పెటడం సరికాదు. గ్రూప్ లోన్ గడువు ఇంకా ఉండగానే త్రిఫ్ట్ ఫండ్ ద్వారా వచ్చిన డబ్బులను పట్టుకుంటామని చెప్పడం సరికాదు.

- నరసింహ, నేత కార్మికుడు, అమరచింత

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



గ్రూప్ లోన్ గడువు ఇంకా ఉన్నా విషయం వాస్త వమే. త్రిఫ్ట్ ఫండ్ అకౌంట్‌లు ఉన్నాయనే వారికి గ్రూప్ లోన్లు ఇచ్చాం. ప్రభుత్వం త్రిఫ్ట్ ఫండ్ డబ్బులను విడుదల చేసినందుకు అధికారుల ఆదేశాల మేరకే గడువు ఉండగా డబ్బులు పట్టుకుంటామని తెలియజేశాం.

- ఎండీ అబ్దుల్ నబీ, డీసీసీ బ్యాంకు మేనేజర్

వృత్తి విద్యా కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆధునిక వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇది చక్కని అవకాశమని పేర్కొన్నారు. ఈ ఆధునిక వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు గాను శుక్రవారం రాష్ట్ర లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీ ప్రిన్సిపాల్ సెక్రటరీ సంజయ్ కుమార్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రస్తుతం బాగా డిమాండ్ ఉన్న వృత్తి విద్యా కోర్సుల్లో ఖాళీలను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేసుకోవాలని వీ డియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. వనపర్తి జిల్లాలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ 40 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ 24 సీట్లు, బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరి ఫైయర్ మెకానికల్ 24 సీట్లు, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ 20 సీ ట్లు, అడ్వాన్స్‌డ్ సీఎంసీ మిషన్ టెక్నీషియన్ 24 సీట్లు, ఇండస్ట్రీయల్ రోబో టిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్షరింగ్ టెక్నీషియన్ 40 సీట్లు ఉన్నాయని తె లిపారు. కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

గ్రూప్ 3 పరీక్ష నిర్వహణకు..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించబోయే గ్రూప్ 3 పరీక్షలకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్ 3 పరీక్షల నిర్వహణపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. నవంబర్ 17న ఉదయం, మ ధ్యాహ్నం నవంబర్ 18న ఉదయం మాత్రమే జరిగే పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరె న్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ... వనపర్తి జిల్లాలో గ్రూప్ 3 పరీక్షల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 8664 మంది అభ్యర్థులకు గాను పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 31 పరీక్ష కేంద్రాలను గుర్తించామన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సంచిత్ గంగ్వార్

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్రీడలు

పల్లెల్లోని క్రీడాకారుల క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రపంచ స్థాయిలో విజేతలను చేసేందుకు సీఎం కప్ క్రీడలు ఎంతో దోహదపడుతాయని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. నవంబర్‌లో ప్రారంభం కానున్న సీఎం కప్ క్రీడా జ్యోతి సంఘీభావ ర్యాలీ శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. నవంబర్ మొదటి వారంలో సీఎం కప్ క్రీడలు, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కొనసాగుతాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులతో హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి విజేతలుగా నిలిపేందుకు ఈ క్రీడలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

విద్యా చట్టాలను పోరాటాలతో సాధిస్తాం

వనపర్తి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యా చట్టాలను పోరాటా లతో సాధించుకుందామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదా నంలో ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ వనపర్తి జి ల్లా కార్యవర్గం పాలిటెక్నిక్ కళాశాలలో పీడీఎస్‌యూ 50 వసంతాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఓయూలో అక్టోబరు 21న జరి గే 50 వసంతాల సభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఐదు దశాబ్దాలుగా శాస్త్రీయ విద్య సాధన లక్ష్యంగా విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు.

విద్య హక్కు చట్టాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

వనపర్తి రూరల్ : విద్య హక్కు చట్టాని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డిఫెన్స్ లీగల్ ఎడ్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. శుక్రవారం వనపర్తి మండల పరిధిలోని చిట్యాల చేయూత అనాథ ఆశ్రమంలో వనపర్తి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులని, అందుకు మీరు కష్టపడి చదివి దేశానికి పేరు తీసుకురా వాలన్నారు. శ్రీదేవి, రేణుక, శోభరాణి, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవించే హక్కు కల్పించాలి



అమరచింత అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించాలని మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్ర సంక్షేమ అధికారి లక్ష్మమ్మ ఆదేశాల మేరకు ఆత్మకూరులోని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న మహిళలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాటా ్లడారు. మహిళలు విధులు నిర్వహిస్తున్న ప్రదేశాల్లో వేధింపుల చట్టం 2013 ప్రకారం మహిళా సాధికారిక కమిటీని ఏర్పాటు చేశా మన్నారు. కమిటీలు ఏర్పాటుతో స్వేచ్ఛగా జీవించే హక్కు కోల్పోకుండా ఉంటారన్నారు.

అమరచింత : మహిళలపై జరుగుతున్న వేధింపులు అరికట్టాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్టు శ్రీవాణి సలోమి పేర్కొన్నారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు ఇంటర్నల్ కాంప్లెక్స్ కమిటీలను ఏర్పాటు చేసి కమిటీ పేర్లను బోర్డుపై ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ఖిల్లాఘణపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహించే వ్యవహారాలపై గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకటాచారి అన్నారు. మండలంలోని దొంతికుంట తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రికార్డులను ఎంపీడీవో వెంకటాచారి తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామాలకు వచ్చే నిధుల ఆదాయ, వ్యయాలను నెలవారీగా రిజిస్టర్లను నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. జనన, మరణ ధృవీకరణ రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అభివృద్ధిపై శ్రద్ధ వహించాలని అన్నారు. శానిటేషన్ పనులను గ్రామాల్లో క్రమం తప్పకుండా నిర్వహించాలని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి భాగ్య పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటాచారి

పరిసరాల శుభ్రతపై బాధ్యత వహించాలి

ఆత్మకూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రతపై బాధ్యత వహించి, ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ శశిధర్ తెలిపారు. ఫ్రై డే డ్రై డే సందర్భంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని 5వ వార్డులో శుభ్రత పాటించాలని ఆయన కాలనీవాసులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఛైర్‌పర్సన్ గాయత్రి, వార్డు కౌన్సిలర్ పోషన్న, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

పాన్‌గల్ : మండలంలోని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతనే లక్ష్యంగా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు శాఖాపూర్, వెంగలాయిపల్లి, కేతేపల్లి, తెల్ల రాళ్లపల్లి, మహమ్మ దాపూర్ తదితర గ్రామాల్లో ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు.



వనపర్తిలో నిల్వ నీటి పాత్రలను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

వనపర్తి రూరల్ : వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో రాఘవ అన్నారు. డ్రై డే లో భాగంగా వనపర్తి మండల పరిధిలోని నాచహల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డోర్ టు డోర్ తిరిగి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తల గురించి వివరించారు..



నాచహల్లి పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాఘవ

వనపర్తి వైద్య విభాగం : మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి సీజన్ వ్యాధుల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఫ్రై డే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో ఇంటింటిని సందర్శించి ఇళ్లలో ఉండే నీటి పాత్రలను పరిశీలించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

అమరచింత : ఫ్రై డే డ్రై డేలో భాగంగా మునిసి పాలిటీలోని పలు వార్డుల్లో మురికి కాల్వలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తా చెదారాన్ని తీసివేశారు. మంగమ్మ గోపి, నూరుల్ నజీబ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



కొత్తకోట శంకర సముద్రంలో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల వారికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సరళసాగర్ ప్రాజెక్టులో నాలుగు లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ముదిరాజులను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని అన్నారు. అదే విధంగా ఇప్పటికే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, గృహాలకు 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు, రూ.500కే సబ్సిడీ సిలిండర్ వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు.

పరిహారం అందజేత...

మండలంలోని నర్సింగాపురానికి చెందిన చెన్నయ్య ఉపాధిహామీ పనులు చేస్తుండగా.. గుండెపోటుతో మరణించాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.రెండు లక్షల విలువ చేసే ఎక్స్‌గ్రేషియా ప్రొసీడింగ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు.

మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు

కొత్తకోట : చేపపిల్లల విడుదలతో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కానాయపల్లి గ్రామ సమీపంలోని శంకర సముద్ర రిజర్వాయర్‌లో ఆరు లక్షల చేప పిల్లలను వదిలి ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి గ్రామంలో చేపలే జీవనాధారంగా జీవిస్తున్న కుటుంబాలు ఉన్నాయని, వారు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యమన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



బహుమతులు ప్రదానం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్, పీడీ శ్రీనివాసులు

వనపర్తి రూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామం గ్రామ పంచాయతీలో ప్రీమియం లీగ్ (పీపీఎల్ సీజన్ 6) టోర్నీలో గెలుపొందిన టీంలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. దసరా పండుగను పురస్కరించుకుని ఈనెల 9న ప్రీమి యం లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభమై 15న ముగిశాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి గెలుపొందిన విజేత రాయల్ హిట్టర్స్ టీం షీల్డ్, రూ.15 వేలు, రెండో బహుమతి విజేత ఒరిజినల్ గ్యాంగ్ స్టర్స్ టీం షీల్డ్, రూ.10,000, మూడో బహుమతి విజేత స్మేషర్స్ లెవెన్ టీం రూ.6 వేలు, నాలుగో బహుమతి ఇందిరమ్మ కాలనీ టీం రూ.4 వేలు గెలుచుకున్నారు. క్రికెట్ టోర్నీలో గెలుపొందిన టీంలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పాన్సర్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. మాజీ ఎంపీటీసీ కురుమూర్తి, జానకి కొండన్న, మల్లికార్జున్, కొత్తకాపు శేఖర్ రెడ్డి, వెంకటయ్య, శివన్న, విష్ణువర్ధన్ రెడ్డి, రాములు, బుచ్చిబాబు, రమేష్, కృష్ణయ్య, దత్తాత్రేయులు, భాస్కర్ రెడ్డి, శివకుమార్, సయ్యద్ ఖాసీం పాల్గొన్నారు.

అండర్ 17 వాలీబాల్ పోటీల్లో..

వనపర్తి మండల పరిధిలోని చిట్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయికి ఎన్నికయ్యారు. వనపర్తి పట్టణ కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో పాటు చిట్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు వేణుకుమార్, కార్తీక్, భవ్య పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్, పీఈటీ శ్రీనివాసులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుతుబ్

ఆత్మకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లోని బోధన ఫీజులు, ఉపకార వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2021 నుంచి 24 వరకు రూ.7,700 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. వైఎస్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం బోధనా ఫీజులు, ఉపకార వేతనాల వంటి చెల్లింపు విధానం తీసుకొచ్చిందన్నారు. ఇది వరకు ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. బోధన ఫీజులు చెల్లించక పోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి బోధనా ఫీజులు, ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శేఖర్, రవికుమార్, వసీం పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

వనపర్తి టౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వ హించే అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 4వ మహాసభలను జయ ప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షు రాలు గద్వాల సాయిలీల పిలుపునిచ్చారు. శుక్ర వారం జిల్లా కేంద్రం లోని భగత్‌సింగ్ నగర్‌లో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడ పత్రిక ను ఐద్వా సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ బహి రంగ సభకు ఆల్ ఇండియా ఐద్వా జాతీయ నా యకురాలు మాజీ ఎంపీ బృందాకారత్ హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఉమా, సుగుణమ్మ, శివ మ్మ, ప్రసన్న, జయమ్మ, భానుప్రియ, సావిత్రి, అక్షయ, హరిణి తదితరులు పాల్గొన్నారు.



మహాసభల గోడపత్రికలను విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

శిక్షణా తరగతులు జయప్రదం చేయాలి

వనపర్తి టౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : పాన్‌గల్ మండల కేంద్రంలో ఈనెల 20న జరిగే సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీపీఐ రాజకీయ విధానం క్యాడర్‌లోకి బలంగా తీసుకువెళ్లి, గ్రామాల్లో పార్టీని పటిష్ఠం చేయడం, ప్రజా సమస్యలపై పోరాటం లక్ష్యాలుగా తరగతులు ఉంటాయన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, గోపాలకృష్ణ, పట్టణ నాయకులు జయమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై కొమ్మల తొలగింపు

అమరచింత, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : రహదారి వెంట ప్రమాద భరితంగా ఉన్న కొమ్మలు, ముళ్ల చెట్లను ఎస్‌ఐ సురేష్ చొరవతో శుక్రవారం తొలగించారు. ఆత్మకూరు, మరికల్ రహదారితో పాటు జూరాల ప్రాజెక్టుకు వెళ్లే రహదారి మలుపులో ప్రమాద భరితంగా పెరిగిన కొమ్మలు, పిచ్చి మొక్కలను ఎక్సికవేటర్ సాయంతో ఎస్‌ఐ ప్రత్యేక చొరవతో అక్కడే ఉండి తొలగించారు. కొన్ని నెలలుగా జూరాల ప్రాజెక్టుకు వెళ్లే రహదారి పిచ్చి మొక్కలు పెరిగి రోడ్డు ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. వాటి నివారణకు చెట్లు తొలగించినట్లు చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పాన్‌గల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెంగలాయిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ మల్లెపు రాంచంద్రయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హుటా హుటిన బాధితుడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం గాంధీ ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

ఆరేపల్లిలో సభ్యత్వ నమోదు

ఆత్మకూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేస్తున్నామని ఆత్మకూరు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వేణు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆరేపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ నాయకులతో కలిసి శుక్రవారం చేపట్టారు. ఆంజనేయులు, లక్ష్మి కాంత్, రాఘవేంద్ర, విజయ్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

పెద్దమందడి, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి) : పెద్దమందడి మండలం చిన్నమందడికి చెందిన మహమ్మద్‌ఖాదర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి వెంటనే స్పందించి రూ.4,50,000ల ఎల్‌వోసీని హైదరాబాద్‌లో అందజేశారు. సూర్యచంద్రారెడ్డి పాల్గొన్నారు.